RNI NO. APTEL/2014/58326

# నవతరం

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 161 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

28-04-2026 మంగళవారం వెల : 1 /- పేజీలు : 4

# సిక్కోలు పెట్రోలు కరువు






- బంకుల ముందు కిలోమీటర్ల క్యూలు
- "నో స్టాక్" బోర్డులతో ప్రజల ఆగ్రహం
- 200 పరిమితితో వాహనదారుల ఇబ్బందులు
- ఆటో డ్రైవర్లకు ఆదాయం ఆగిన దుస్థితి
- రోడ్డుమధ్యలో ఆగిపోతున్న వాహనాలు
- అధికారుల తీరుపై విమర్శలు
- వెంటనే సరఫరా పునరుద్ధరణ డిమాండ్

**నవతరం ప్రతినిధి, శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లాలో పెట్రోల్ సంక్షోభం రోజురోజుకూ తీవ్రమవుతోంది. గత మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంకుల వద్ద భారీ క్యూలు కనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా వాహనాల బారులు తీరగా, చాలాచోట్ల "నో స్టాక్" బోర్డులు పెట్టడంతో ప్రజలు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

శ్రీకాకుళం నగరంతో పాటు నరసన్నపేట, టెక్కలి, ఇచ్ఛాపురం, సోంపేట, ఆమదాలవలస, పాలకొండ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఉదయం నుంచే బైక్‌లు, కార్లు, ఆటోలు బంకుల ముందు నిలబడి కనిపిస్తున్నాయి.

చాలాచోట్ల స్టాక్ పూర్తిగా అయిపోవడంతో బంకులు మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంధనం అందుబాటులో ఉన్న కొన్ని బంకుల్లో ఒక్కో వాహనానికి 200 వరకే పరిమితి విధిస్తున్నారు. దీంతో గంటల తరబడి క్యూలో నిల్చున్న వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రోజువారీ ఆదాయంపై ఆధారపడే ఆటో డ్రైవర్లు, డెలివరీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొన్ని ప్రాంతాల్లో పెట్రోల్ కోసం వేచి చూసే క్రమంలో ప్రజలు బంక్ సిబ్బందితో వాగ్వాదాలకు దిగుతున్నారు. మరికొన్ని చోట్ల ఇంధనం లేక వాహనాలు రోడ్డుమధ్యలోనే ఆగిపోతున్నాయి. అత్యవసర పనుల కోసం బయలుదేరిన వారు కూడా వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇంత పెద్ద సమస్య నెలకొన్నా అధికార యంత్రాంగం నుంచి స్పష్టమైన స్పందన కనిపించకపోవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.

సరఫరా లోపమా, రవాణా అంతరాయమా, లేక పరిపాలనా నిర్లక్ష్యమా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో జిల్లా రవాణా వ్యవస్థ స్తంభించే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. వెంటనే జోక్యం చేసుకుని పెట్రోల్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీకాకుళం ఆధ్యాత్మిక వైభవాన్ని కనులార వీక్షించిన ఉప రాష్ట్రపతి

- రామ్మోహన్ నాయుడు ఆహ్వానంతో సిక్కోలు బాటపట్టిన ఉప రాష్ట్రపతి.
- జిల్లాలో సుడిగాలి పర్యటన. - అరసవల్లి, శ్రీకూర్మం క్షేత్రాల సందర్శన.
- రామ్మోహన్ నాయుడు నివాసంలో మధ్యాహ్నం విందు.
- ఉత్తరాంధ్ర రుచులతో ప్రత్యేక మెనూ సిద్ధం చేయించిన కేంద్ర మంత్రి.



2లో









# సముద్రపు నాచుతో మత్స్యకారులకు కొత్త బాట

- పలాస తీరంలో సీవీడ్ సాగుపై ప్రత్యేక దృష్టి
- మత్స్యకారుల ఆదాయానికి అదనపు మార్గాల అన్వేషణ
- చెన్నై నిపుణుల బృందం తీరప్రాంతాల పరిశీలన
- తక్కువ ఖర్చుతో అధిక లాభాల అవకాశాలు
- మహిళలు, యువతకు ఉపాధి అవకాశాల సూచన
- అనుకూల ప్రాంతాల గుర్తింపుకు సర్వే
- త్వరలో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభానికి సన్నాహాలు

2లో



# వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



**నవతరం -శ్రీకాకుళం**

జిల్లాలోని క్రీడాకారులు, విద్యార్థులు వివిధ క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవడం కోసం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను మే 1వ తేదీ నుండి 31వ తేదీ -మిగతా 2లో

- జిల్లాలో 68 కేంద్రాల్లో శిక్షణకు ఏర్పాట్లు
- 8 నుండి 16 ఏళ్ల బాలబాలికలకు అవకాశం
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎడిటోరియల్

# లొంగు'బాట'లో ఐరోపా!

ప్రజాస్వామ్యం, గణతంత్రం, మానవహక్కులు, స్వేచ్ఛ వంటి నేతిబీర కబుర్లు చెబుతున్న నేతలకు ఇప్పుడు డోనాల్డ్‌ట్రంప్ రూపంలో అగ్నిపరీక్ష ఎదురైంది. వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను కిడ్నాప్ చేసిన తీరుచూసి అగ్రరాజ్యం ఇలా కూడా చేస్తుందా? అని సామాన్యులు నమ్మలేకపోతున్నారు. గతంలో హిట్లర్ ప్రపంచ దురాక్రమణకు పాల్పడినతీరు, పర్యవసానాలను యావత్ ప్రపంచం చవిచూసింది. ఇప్పుడు ఏదో ఒకసాకుతో అమెరికా తనకు కావాల్సిన ప్రాంతాలను స్వచ్ఛందంగా అప్పగించాలి లేదా బలప్రయోగం చేయాల్సి వస్తుందని చెబుతోంది. ఇది ఏ పరిణామాలు, పర్యవసానాలకు దారితీస్తుందో తెలియదు. మదురో తదుపరి లక్ష్యం డెన్మార్క్‌లో అంతర్భాగం, స్వయం పాలిత ప్రాంతమైన గ్రీన్‌లాండ్ స్వాధీనం అని ప్రకటించారు. తన భద్రత అవసరాలకు సహజ సంపదలతో జర్మనీ కి మూడు రెట్లు పెద్దదైన ఆ మంచుదీవి కావాలని చెబుతున్నాడు. 'తోటకూరనాడే నిరోధించి ఉంటే తమ బిడ్డ ఇలా ముదిరేవాడు కాదన్న' లోకోక్తి మనకే కాదు యావత్ ప్రపంచానికి తెలిసిందే.

రెండోసారి అధికారం చేపట్టిన కొద్దిరోజులకే గతేడాది జనవరిలోనే గ్రీన్‌లాండ్ కావాలన్న వాంఛను ట్రంప్ ప్రకటించాడు. అప్పుడే ఇతర నాటోదేశాలు, ముఖ్యంగా ఐరోపా పెద్దలుగా ఉన్న జర్మనీ, ఫ్రాన్సు, బ్రిటన్ గట్టిగా హెచ్చరించి అడ్డుకొని ఉంటే ఇంతదాకా వచ్చేది కాదు. ఇప్పుడు ఆ ప్రాంతాన్ని కబ్జా చేసుకొనేందుకు సిద్ధపడటాన్ని చూసి గొణగటం తప్ప వారికి నోటమాట రావటం లేదు. 'గ్రీన్‌లాండ్ నాటోలో భాగం, ఆర్కిటిక్ ప్రాంతంలో భద్రత ఉమ్మడిగా సాధించాలి, అమెరికాతో సహా అందరికీ బాధ్యత ఉందని' అంటూనే డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌కు సంబంధించిన అంశాలపై నిర్ణయించుకోవాల్సింది కూడా వారే అంటూ ఐరోపా యూనియన్ చెప్పటం అమెరికాకు దాసోహం తప్ప మరొకటి కాదు. పెద్దన్న కావాలంటున్నాడు ఇవ్వాలో లేదో మీరు మీరు తేల్చుకోండని చేతులెత్తేసినట్లే. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటే నాటో విచ్ఛిన్నమైనట్లే అని డెన్మార్క్ తన పౌరులను సంతుష్టీకరించేందుకు ఒక ప్రకటన చేసినప్పటికీ సదరు పెద్ద దేశాల వైఖరి ఎలా ఉంటుందో దాని కి ముందే తెలుసు. అందుకే కావాలంటే గ్రీన్‌లాండ్‌లో ఇప్పటికే ఉన్న అమెరికా మిలిటరీ స్థావరాన్ని మరింత పటిష్ట పరుచుకొనేందుకు తమకు అభ్యంతరంలేదని, తాము కూడా అక్కడ నాలుగు వందల కోట్ల డాలర్లతో నౌకలు, డ్రోన్లు, విమానాలను మోహరి స్తామని ఇటీవలనే డెన్మార్క్ ప్రకటించిన అంశాన్ని మరచిపోరాదు. కొరకరాని కొయ్యగా ఉన్న రష్యాను మచ్చిక చేసుకొని చైనాతో ఉన్న బంధాన్ని తెంచేందుకు అమెరికా ఎప్పటి నుంచో బిస్కెట్లు వేస్తున్నది. కావాలంటే ఉక్రెయిన్‌లో ఎంత ప్రాంతం కావాలంటే అంత తీసుకోవచ్చని చెప్పటం దానిలో భాగమే. గతంలో ఒకసారి జి8 కూటమిలో చేర్చుకొని తర్వాత బయటకు గెంటేసిన అనుభవం ఉంది. ట్రంప్- పుతిన్ ఇద్దరూ ఇసుక తక్కెడ పేడ తక్కెడ రకాలు గనుక అంత తేలికగా అమెరికాను నమ్మటం లేదు. ఉక్రెయిన్‌లో రష్యాను అడ్డుకొనే స్థితి కనుచూపుమేరలో కనిపించటం లేదు, ఇప్పుడు గ్రీన్‌లాండ్‌ను అమెరికా ఆక్రమిస్తే మీరేం చేస్తున్నారని యూరోపియన్లు తమ దేశాల నేతలను ప్రశ్నించటం సహజం. అమెరికాను ఎదిరించలేరు, ఆధిపత్యాన్ని ఆమోదించనూ లేరు అన్నట్లుగా ఐరోపా పెద్దల పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదు.

ప్రపంచాన్ని పంచుకొనేందుకు ఐరోపా దేశాలే దెబ్బలాడుకున్నాయి, అమెరికా ఆలస్యంగా రంగంలోకి వచ్చింది. లాటిన్ అమెరికా దేశాలు ఐరోపా ముఖ్యంగా స్పెయిన్, బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం పొందిన తరువాత తిరిగి అవి వాటి మీద పెత్తనం చేయకుండా తన ఆధీనంలోకి తెచ్చుకొనేందుకు ఆ దేశాల్లో మరోసారి ఐరోపా జోక్యం చేసుకోకూడదంటూ దుష్టాలోచనతో ముందుకు తెచ్చిందే అమెరికా మన్రో సిద్ధాంతం. దానికనుగుణంగానే తరువాత కాలంలో తన పెరటితోటగా మార్చుకుంది.

అక్కడ వామపక్ష శక్తుల ప్రభావం పెరుగుతుండటంతో తిరిగి తన పట్టునిలుపు కొనేందుకు అమెరికా ఆటవిక న్యాయానికి దిగింది. దాన్నే డోన్రో (డోనాల్డ్ ట్రంప్-మన్రో) సిద్ధాంతం అంటున్నారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాను నాటో పేరుతో తన కట్టడిలోకి అమెరికా తెచ్చుకుంది. పాము తనపిల్లలను తానే తింటుందన్నట్లుగా నాటో రక్షణలో ఉన్న గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించుకొనేందుకు అమెరికా స్వయంగా పూనుకుంది. ఐరోపాలో ఉన్న సామ్రాజ్యవాద శక్తులు అమెరికాను ఒంటరిగా ఎదిరించలేకనే ఐరోపా సమాఖ్యను ముందుకు తీసుకు వచ్చాయి, ఇటీవలి కాలంలో మిత్రవైరుధ్యం తలెత్తింది. దాన్లో భాగంగా అదే ఐరోపా దేశాల మీద పన్ను విధిస్తానంటే అవి మూసుకొని కూర్చున్నాయి. అయితే ఎల్లకాలం ఇదే విధంగా ఉంటాయని అనుకోరాదు. తమ మౌలిక ప్రయోజనాలకు దెబ్బతగలనంత వరకు రాజీపడతాయి. తర్వాత లడాయికి దిగుతాయి.

# విశ్వ పుత్రిక గజల్ ఫౌండేషన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా టి.డి జనార్ధన్‌చే పోలయ్య కవి కూకట్లపల్లి కి ఘన సన్మానం

**నవతరం-హైదరాబాద్**

బాగ్ లింగంపల్లి విశ్వ పుత్రిక గజల్ ఫౌండేషన్ 5 వ వార్షికోత్సవం సందర్భంగా వ్యవస్థాపకురాలు శ్రీమతి డాక్టర్ విజయలక్ష్మి పండిట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గజల్స్ పుస్తకావిష్కరణ సభ ఘనంగా జరిగింది. కళారత్న డాక్టర్ బిక్కీ కృష్ణ అధ్యక్షత వహించిన ఈ సభకు ముఖ్య అతిథిగా తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు టి.డి జనార్థన్ హాజరై విజయలక్ష్మి పండిట్ వ్రాసిన గజల్స్ పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు

ఈ సందర్భంగా కొందరు గజల్ గాయకులు విజయలక్ష్మి పండిట్ మరియు కళారత్న బిక్కీకృష్ణ వ్రాసిన గజల్స్ అద్భుతంగా గానం చేసి సభికులను సంతోష సాగరంలో ముంచారు సభను అలరించారు.

ఈ సందర్భంగా సమకాలీన సామాజిక అంశాలు మానవ సంబంధాలే...ఇతివృత్తంగా దాదాపుగా 4500 లకు పైగా కవితలను వ్రాసి చేస్తున్న సాహితీ సేవకు కృషికి గుర్తింపుగా...ప్రముఖ కవి, రచయిత, నటుడు, పోలయ్య కవి కూకట్లపల్లిని టిడిపి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు టి. డి జనార్ధన్...డా. విజయ లక్ష్మి పండిట్...కళారత్న బిక్కీ కృష్ణ మెమోంటో, శాలువా, సర్టిఫికెట్ లతో ఘనంగా సత్కరించారు. కూకట్లపల్లి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు

ఇంకా ఈ సభలో...నరసింహప్పు...జీవన్ లాల్ రవి శంకర్...డా.వి.డి రాజగోపాల్...ప్రతాప్




రెడ్డి...డా.రాధా కుసుమ తదితరులు పాల్గొని ప్రసంగించారు

తదనంతరం దాదాపు వందమంది గజల్ కవులకు గాయకులకు వివిధ రంగాలలో విశిష్ట సేవలు

నందించిన ప్రముఖులకు డాక్టర్ విజయలక్ష్మి పండిట్...టి .డి జనార్దన్...చేతుల మీదుగా జీవన సాఫల్య మరియు జాతీయ అవార్డులను అందజేసి అందరినీ ఘనంగా సన్మానించడం జరిగింది...

# వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మొదటిపేజీ తరువాయి

ఉచితంగా నిర్వహిస్తున్నట్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 68 కేంద్రాలలో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ శిబిరాల్లో పాల్గొనేందుకు 8 నుండి 16 సంవత్సరాల వయసు కలిగిన బాలబాలికలు అర్హులు. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల నుండి 8.00 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5.00 గంటల నుండి 7.00 గంటల వరకు శిక్షణలు ఉంటాయి. ఆసక్తి గల క్రీడాకారులు sport.ap.gov.in వెబ్‌సైట్ లేదా క్రీడా యాప్ ద్వారా తమ పేర్లను ముందస్తుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలోని ప్రధాన కేంద్రాలైన శ్రీకాకుళం కోడి రామమూర్తి స్టేడియం, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, నరసన్నపేట, ఆముదాలవలస, రణస్థలం తదితర ప్రాంతాల్లో అథ్లెటిక్స్, బాక్సింగ్, కబడ్డీ, వాలీబాల్, హాకీ, హ్యాండ్ బాల్, వెయిట్ లిఫ్టింగ్ వంటి వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిబిరాల్లో నిష్ణాతులైన కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు విద్యార్థులకు మెళకువలునేర్పిస్తారన్నారు.

## 68 చోట్ల శిబిరాలు:

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఏ. మహేశ్ బాబు, సెట్ శ్రీ సిఇఓ వి. వెంకట అప్పలనాయుడు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ బీవీ రమణలు శిబిరాలు దించే ప్రాంతాల జాబితాను సోమవారం తమ కార్యాలయంలో ప్రకటించారు. మరింత సమాచారం కోసం 7680075375 నంబర్‌ను లేదా Srikakulam.dsa@gmail.com ఈమెయిల్ ద్వారా, లేదా డిఎస్ఏ క్యూఆర్ కోడ్ సంప్రదించాలని వారు సూచించారు.

# సముద్రపు నాచుతో మత్స్యకారులకు కొత్త బాట

**నవతరం ప్రతినిధి, పలాస**

పలాస నియోజకవర్గ తీరప్రాంత మత్స్యకారుల ఆదాయాన్ని పెంచే దిశగా సముద్రపు నాచు (సీవీడ్) సాగుపై ప్రత్యేక చర్యలు ప్రారంభమయ్యాయి. పలాస నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త వెంకన్న చౌదరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఈ నేపథ్యంలో చెన్నైకు చెందిన పరిశోధకులు డాక్టర్ ఆదివిశ్వనాథ్, డాక్టర్ గౌతమ్, డి. రమణల బృందం స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి తీరప్రాంతాలను సందర్శించి పరిశీలనలు చేపట్టింది. సముద్రపు నాచు పెంపకానికి అనుకూల పరిస్థితులను అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా నిపుణులు మత్స్యకారులకు సీవీడ్ సాగు విధానం, పెంపకం, సేకరణ, నిల్వ, మార్కెటింగ్ పద్ధతులపై సమగ్ర అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు పొందే అవకాశం ఈ రంగంలో ఉందని వివరించారు.

ముఖ్యంగా మహిళలు, యువత ఈ రంగంలో ముందుకు వస్తే కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడటంతో పాటు గ్రామీణ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సూచించారు. స్వయం ఉపాధికి ఇది మంచి మార్గమని తెలిపారు. అనంతరం చెన్నై బృందం తీరప్రాంతాలను సందర్శించి సముద్రపు నాచు పెంపకానికి అనువైన ప్రదేశాలను గుర్తించింది. నీటి నాణ్యత, అలల ప్రభావం, వాతావరణ పరిస్థితులు, తీర భౌగోళిక స్వభావాన్ని పరిశీలించి నివేదిక సిద్ధం చేయనున్నట్లు వెల్లడించింది.

స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ మత్స్యకారులకు చేపల వేటతో పాటు అదనపు ఆదాయ వనరులు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. త్వరలో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించి అవసరమైన శిక్షణ, సబ్సిడీలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఈ కార్యక్రమం విజయవంతమైతే మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడటమే కాకుండా పలాస తీరప్రాంత ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# శ్రీకాకుళం ఆధ్యాత్మిక వైభవాన్ని కనులార వీక్షించిన ఉప రాష్ట్రపతి

**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలు శ్రీకూర్మం కూర్మ క్షేత్రాన్ని, అరసవల్లి ఆదిత్య ఆలయాన్ని భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ దర్శించుకున్నారు. విశాఖపట్నంలో ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనడానికి విచ్చేస్తున్నారన్న సమాచారం మేరకు ఆయనను శ్రీకాకుళం జిల్లా పర్యటనకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం జిల్లాలో పర్యటన చేపట్టిన ఉప రాష్ట్రపతి.. జిల్లా ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

తొలుత షెడ్యూల్ కన్నా ముందుగానే 10:30 గంటలకు శ్రీకాకుళం నగరం డచ్ బిల్డింగ్ వద్ద హెలిప్యాడ్ కు ఉపరాష్ట్రపతి బృందం పర్యటించిన రెండు వాయుసేన చాపర్లు చేరుకున్నాయి. అక్కడ వారికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తో పాటు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు సాదర స్వాగతం పలికారు. అక్కడి నుండి నేరుగా శ్రీకూర్మం చేరుకున్నారు.

ఆలయ మర్యాదలతో ఆహ్వానం తరువాత శ్రీకూర్మనాథున్నీ ఉపరాష్ట్రపతి దర్శించుకున్నారు. కూర్మ క్షేత్ర వైభవాన్ని అర్చకులు వివరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను, చిత్ర పటాన్ని అందజేశారు. ఆలయ పరిసరాలను, తాబేళ్ల పార్క్ ను సందర్శించారు. ఆలయ శిల్ప సంపద పట్ల మంత్రముగ్ధులు అయ్యారు. అక్కడే కాసేపు స్థానికులతో ముచ్చటించారు.

అక్కడి నుండి అరసవల్లి సూర్య దేవాలయానికి ఉప రాష్ట్రపతి కాన్వాయ్ చేరుకుంది. ఆలయ మర్యాదలతో ఆదిత్యుని దర్శనం చేసుకున్న రాధాకృష్ణన్ ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజ స్తంభం వద్ద సాష్టాంగ నమస్కారం చేసి తన దైవ భక్తిని చాటుకున్నారు. దర్శన అనంతరం అనివెట్టి మండపంలో వేద ఆశీర్వచనంను, తీర్థ ప్రసాదాలను, చిత్ర పటాలను అందజేశారు.

సిక్కోలు పురాతన ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ప్రశాంతమైన దర్శనం తరువాత నగరంలోని ఎనబై అడుగుల రహదారిలో ఉన్న రామ్మోహన్ నాయుడు నివాసానికి ఉపరాష్ట్రపతి చేరుకున్నారు. తన ఇంటికి వచ్చిన ఉపరాష్ట్రపతికి ఈ సంధర్భంగా పుష్పగుచ్ఛంతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్వాగతం పలికారు. ఇంటిలోకి తీసుకుని వెళ్ళి జిల్లా ప్రజా ప్రతినిధులను, తన కుటుంబ సభ్యులను, జిల్లా అధికార యంత్రాంగాన్ని పరిచయం చేశారు.

జిల్లా పర్యటనకు విచ్చేసిన ఉపరాష్ట్రపతికి ఉత్తరాంధ్ర రుచులతో ప్రత్యేక మెనూ సిద్ధం చేయించారు రామ్మోహన్ నాయుడు.

నలభీములతో. ఉత్తరాంధ్ర వంటల వాసనలు గుప్పుమనిపించారు. పూర్తి శాఖాహార వంటలను చెఫ్ లు వండి వార్చగా.. అందులో అరటికాయ పులుసు, కొబ్బరి వెజిటబుల్ పులావ్, ముల్లంగి సాంబార్ లను అక్కడివారు ఇష్టంగా తీసుకున్నారు. ఏభైకి పైగా వంటలతో ఉపరాష్ట్రపతి తో విందును మరింత ప్రత్యేకంగా మార్చారు కేంద్ర మంత్రి. ములక్కాడ రసం, బీరకాయ రోటి పచ్చడి, పన్నీర్ కుర్మా, గుత్తి వంకాయ, పాలకూర పప్పు.. అతిథులను నోరూరించాయి.

విందు అనంతరం అరసవల్లి ఆదిత్యుని ప్రత్యేక చిత్రపటాన్ని, పొందూరు ఖద్దరు వస్త్రాలను జ్ఞాపికగా రామ్మోహన్ నాయుడు.. ఉప రాష్ట్రపతి కి అందించారు. ఈ సందర్భంగా పొందూరు ఖాదీ ప్రత్యేకతను రామ్మోహన్ నాయుడు వివరించారు.

అక్కడి నుండి నేరుగా విశాఖ లోని ×చీూ డేగా కు ఉపరాష్ట్రపతి ఛాపర్ కాన్వాయ్ చేరుకుంది. ఆయనతో పాటే విశాఖకు రామ్మోహన్ నాయుడు చేరుకుని ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో భాగస్వామ్యం అయ్యారు.

ఉపరాష్ట్రపతి శ్రీకాకుళం జిల్లా పర్యటనను విజయవంతం చేసిన సందర్భంగా జిల్లా ప్రజలకు, అధికార యంత్రాంగానికి, పోలీసులకు, ప్రజా ప్రతినిధులకు రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. కాగా ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, కూటమి శ్రేణులు, స్థానికులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ కొరతపై వదంతులు, అసత్య ప్రచారాలు నమ్మవద్దు

**నవతరం -శ్రీకాకుళం**

జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ అసత్య ప్రచారాలు,సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందుతున్న వదంతులను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ గారు స్పష్టం చేశారు. ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని,ఎటువంటి కొరత లేదని వెల్లడించారు. ఇంధన సరఫరా, విక్రయాలపై జిల్లా పోలీసు శాఖ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నదని, ఇప్పటికే అన్ని పోలీసు స్టేషన్లుకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. బంక్ నిర్వాహకులు పారదర్శకంగా, క్రమబద్ధంగా విక్రయాలు నిర్వహించి వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఇంధన విక్రయాలను నిలిపివేసినా, అక్రమ నిల్వలు సృష్టించినా, నల్లబజారులో విక్రయాలకు పాల్పడినా, లేదా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసి ప్రజల్లో భయాందోళనలు సృష్టించినా, అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వదంతులను నమ్మి అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వ చేయడం ప్రమాదకరమని, దీనివల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశముందని ఎస్పీ గారు సూచించారు. అదేవిధంగా, అనవసర నిల్వల కారణంగా నిజంగా అవసరమైన వారికి ఇంధనం అందకపోవచ్చని తెలిపారు.జిల్లాలో పోలీసులు రెవెన్యూ, సివిల్ సప్లైస్ శాఖలతో కలిసి ఇంధన నిల్వలు, సరఫరా పరిస్థితిని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.ఎవరైనా ఇంధనాన్ని బ్లాక్ చేయడం, నల్లబజారులో విక్రయించడం, లేదా అసత్య ప్రచారాలు చేయడం గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు.

# హృదయాలను ఉల్లాసపరిచే బీచ్లు

బంగారు ఛాయలో మెరిసే ఇసుక తీరాలు, తెల్లటి నురగలతో ఒడ్డుకు వచ్చిపోయే అలలు, నిటారుగా వెళ్ళే తాటి పవనాలూ, అన్నీ కలిసి ఉల్లాసాన్నందించే సుందర ప్రదేశాలుగా రూపుదిద్దుకున్న బీచ్లు పర్యాటకుల హృదయాలను కొల్లగొట్టడం నిజం. సముద్ర జలాల హోరు, అలల అలజడి, ఒక్కొక్కటిగా వెక్కిరిస్తూ వెళ్లిపోతున్న పడవలూ, సంప్రదాయ వేష, భాషలతో ఏమీ పట్టనట్టు తిరుగాడే జాలర్లూ పర్యాటకులకు పిచ్చెక్కించే దృశ్యాలు. రాష్ట్రంలో బారువా, కళింగపట్నం, భీమునిపట్నం, రిషికొండ, విశాఖపట్నం, గంగవరం, అల్లవరం, మంగినపూడి, సూర్యలంక, ఓడరేవు, కొత్తపట్నం, మైపాడు బీచ్లు ప్రకృతి అందాలను ఆరబోసుకొని, ఆరాటపడే పర్యాటకులతో చెలగాటమాడ్తాయి.
బారువా బీచ్: మహేంద్రతనయ నది, సముద్రంతో ఇక్కడే కలవటం చేత ఇదో సుందర ప్రదేశంగా రూపుదిద్దుకొంది. 1948 వరకూ ఓడరేవుగా ఉన్న బారువా బీచ్ ఆంధ్రప్రదేశ్లో పర్యాటకులకు అందుబాటులోకి వచ్చిన మొదటి బీచ్.
శ్రీకాకుళానికి 109 కి. మీ. దూరంలో ఒరిస్సా సరిహద్దుకు దగ్గర్లోనూ ఉన్న బారువా బీచ్ వలస పక్షులు, దగ్గర్లోని, దుర్గ, జనార్ధన, కోటి లింగేశ్వరాలయాలు, పచ్చని చెట్లూ, దిబ్బలతో, వన్నెలొలికే సముద్రజలాలు, పసిడివన్నె ఇసుక తిన్నెల దోబూచులాటలతో స్థానికులనేకాక, సందర్శకులకు, ట్రంక్లోడ్ ప్రయాణీకులకు సైతం ఆకర్షిస్తుంది.

## కళింగపట్నం బీచ్:

శ్రీకాకుళానికి 30కి.మీ. దూరంలో నున్న కళింగపట్నం ఒకప్పుడు ఓడరేవు. వలలు చేతపట్టిన జాలర్లు, లంగరు వేసిన పడవలతో నిండి ఉండే ఈ బీచ్ పరిమిత సంఖ్యలోనే సందర్శకుల నాకర్షిస్తుంది. వంశధారా నది సముద్రంలో కలిసే దృశ్యం, వచ్చిపోయే వందలనాటుపడవలు, లంగరుతో మొండికేసిన మోటారు బోట్లు, ఫిషింగ్ యాక్టివిటీ, దగ్గర్లోని శాలిహుండం బౌద్ధరామం, అన్నీ కలిపి కళింగపట్నం బీచన్ను ఓ పిక్నిక్ స్పాట్గా తీర్చిదిద్దాయి.

## బందరువారి పాలెం బీచ్:

శ్రీకాకుళానికి 28 కి.మీ. కళింగపట్నానికి 3 కి.మీ. దూరంలో నున్న బందరువారి పాలెం బీచ్ రద్దీలేని ప్రశాంత వాతావరణాన్ని సొంతం చేసుకొంది. మెరిసే ఇసుక తిప్పలు, వెనుకనున్న పచ్చని చెట్ల నేపథ్యంలో గల ఈ బీచ్ వాటర్ స్పోర్ట్స్, బీచ్ రిజార్ట్స్ అనువుగా వుంది. కళింగపట్నం లైట్ హౌస్, ఒడ్డుకు చేరిన నాటుపడవలు, అమాయకంగా చూసే జాలరులు, పడిలేసే కెరటాలు ఈ-బీచ్ ప్రత్యేకతలు.
భీమిలి బీచ్: విశాఖపట్నానికి 30 కి.మీ. దూరంలో గోస్తనీనది, సముద్రంతో కలిసే భీమునిపట్నం వద్దగల బీచ్ అర్ధచంద్రాకారంలో ఉండి, రెండువైపులా తాటితోపులతో, పచ్చటిరంగు పరచిన పసిడిబట్టలా ఉన్న ఇసుక, సురగలతో పడిలేస్తూ, వచ్చిపోతున్న అలలూ, కొంచెం ప్రక్కగా ఉన్న డచ్ సిమెట్రీలూ, లైటొవుసూ, పట్టణానికి వెనగ్గా ఉన్న కొండలో, దేశంలోనే ఇదొక మంచి బీచ్ అనే అభిప్రాయాన్ని కలుగజేస్తున్నాయి.
కొత్తటవర్, పావురాళ్ల కొండమీద క్రీ. పూ. 2 - క్రీ.శ. 1 శతాబ్దాల బౌద్ధ కట్టడాలు రెండొందలేళ్ల ముందు నిర్మించిన డచ్ బిల్డింగ్ శిథిలాలు, ప్రకృతి సిద్ధంగా ఏర్పడి ఉన్న ఎర్రదిబ్బలు ఇక్కడ పర్యాటకులకు లభిస్తున్న ఇతర ఆస్వాదిస్తూ, కొబ్బరిబొండాలతో కాలక్షేపం చేయొచ్చు. విశాఖపట్నం నుంచి 30 కి.మీ.ల బీచ్ రోడ్ గుండా భీమిలికి చేసే ప్రయాణం ఓ థ్రిల్లింగ్ ఎక్సపీరియన్స్నిస్తుంది.

## మంగమారిపేట బీచ్:

విశాఖకు 16 కి.మీ. దూరంలోగల మంగమారిపేట బీచ్ తీరం వెంబడి తాటి చెట్లూ, సరుగుడు తోటలూ, సముద్రంలో అక్కడక్కడా గుంపులు గుంపులుగా కదలాడే నాటు పడవలు, పెద్ద పెద్ద నౌకలు, సమీపంలోని తోట్లకొండ పైన గల బౌద్ధ కట్టడాలు వారాంతాల్లోనూ సాయంవేళల్లోనూ ఉల్లాసంగా గడపటానికి అనువైన స్థలం. వసతి సౌకర్యాలు లేని ఈ బీచ్ టెంపరరీ విజిట్ కొచ్చే నగరవాసులకూ, ఇతర పర్యాటకులకూ కొద్ది సేపు గడపటానికి మాత్రమే ఉపయోగంగా ఉంటుంది. విశాఖ నుంచి భీముని పట్నం, ఐ.ఎస్.ఎస్. కళింగ వరకూ వెళ్లే బస్సులతో పాటు, ప్రైవేటు టాక్సీలు, ఆటోలు, పర్యాటకులకు అందుబాటులో ఉంటాయి.

## రిషికొండ బీచ్:

విశాఖపట్నానికి 10 కి.మీ.ల దూరంలో, నగర జీవితానికి దూరంగా పచ్చటి చెట్ల మధ్యలో కొండ, కోనల సమీపంలో ఉన్న రిషికొండ ధ్వనులూ, రోదలతో విసిగి వేసారిన నగర ప్రజలకు, ఇతర పర్యాటకులకూ ఎడమరచి మరోలోకంలో ఉన్న అనుభూతిని పొందాలంటే రిషికొండ బీచ్ లో కాలుమోపాల్సిందే. ఆసక్తిగల పర్యాటకులు దగ్గర్లని క్రీ.పూ. 3 - క్రీ.శ. 2 శతాబ్దాలకు చెందిన బావికొండ బౌద్ధారామాన్ని కూడా తిలకించవచ్చు. దాదాపు 2 కి.మీ.ల పొడవున్న బీచ్ దగ్గర కొండపైన ముత్యాలహారంగా అమరిన పర్యాటకాభివృద్ధి సంస్థ 'పున్నమి' బీచ్ రిజార్ట్స్ లో బసచేసి సముద్ర గాలుల్లో పరిసరాల ప్రకృతి శోభను పరికించవచ్చు. తగిన పార్కింగు, ఒక రెస్టారెంట్ అందుబాటులో ఉన్న ఈ బీచ్ లో వాటర్ స్పోర్ట్స్ లాంటి కార్యక్రమాలతో పాటు మరెన్నో అభివృద్ధి పథకాలు రూపుదిద్దు కోబోతున్నాయి.

## రామకృష్ణా బీచ్:

విశాఖపట్నం అనగానే స్టీలు సిటీ, సింహచలం దేవస్థానాలు గుర్తుకొస్తాయి.
డాల్ఫిన్స్ నోస్, హార్బర్లతో పాటు బీఛ్ కూడా పర్యాటకుల నోళ్ళలో నానుతుంటుంది. హార్బర్ నుంచి దాదాపు 5 కి.మీ. పొడవున్న చక్కటి రామకృష్ణా బీచ్ రోజూ కొన్ని వేల మందికి ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. హార్బర్కు పర్యాటకులను మరింతగా ఆకర్షిస్తుంటాయి. నోరూరించే సీఫుడ్స్తో పాటు, కాలక్షేపానికి చిరుతిళ్లు కూడా లభించే ఈ బీచ్ అన్ని తరగతుల వారికీ అందుబాటులో ఉంది. స్టార్ హోటల్ నుంచి డార్మిటరీ దాకా పర్యాటకుల అభిరుచి, ఆర్థిక స్తోమతను బట్టి విడిది చేయొచ్చు. సముద్రతీరంలో రోడ్డుకు అవతలిపక్క నగర ప్రముఖుల విగ్రహాలు, రామకృష్ణమఠం, కాళీ టెంపుల్, వుడాపార్క్, విశాఖ మ్యూజియం, మత్స్యదర్శిని, సబ్ మెరైన్లు ఇతర ఆకర్షణల్లో కొన్ని, ఎక్కువ లోతు లేనందువల్ల మోకాళ్ల వరకూ సముద్రంలో కెళితే మన పాదాలకు సాగర కన్య వినమ్రంగా చేసే జలాభివందనాలు మనల్ని ఉత్తేజితుల్ని చేస్తాయి.

## లాసమ్స్-బే బీచ్:

విశాఖలో వుడా పార్కు దాటిన తరువాత లాసన్స్ - బే కాలనీకి ఎదురుగా ఉన్న నిశ్శబ్దమైన చక్కని బీచ్, పచ్చటి కొబ్బరితోటల నేపథ్యంలో పిల్లలను, యువకులనూ ఎక్కువగా ఆకర్షిస్తుంది.

## గంగవరం బీచ్:

విశాఖ స్టీలు సిటీ వెనుక సముద్ర జలాలకు చేరువలో చుట్టూ చెట్లూ, కొండలతో అలరారే గంగవరం ఒకప్పుడు చిన్నపాటి ఓడరేవు. ప్రకృతి అందచందాలను సొంతం చేసుకున్న ఈ బీచ్ ఏకాంతంగా గడపాలనుకొనే వారికి చక్కటి హైడవుట్, సొంతకార్లు, టాక్సీల్లోనే వెళ్ళే వీలున్న ఈ బీచ్ రానురాను జనరంజకమౌతుంది.

## ఉప్పాడ బీచ్:

కాకినాడకు సమీపంలో నున్న ఈ బీచ్ కాకినాడ, పరిసర ప్రాంతాల సందర్శకుల విశ్రాంతి అవసరాలను తీరుస్తుంది. పార్కింగు, రెస్టారెంట్లు, బీచ్ రిజార్టులు, వాటర్ బేస్డ్ 'యాక్టివిటిస్ ఇతర సదుపాయాలను కల్పిస్తే మంచి బీచ్గా రూపొందే అవకాశముంది. సమీపంలోని హోప్ ఐలండ్ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్న నేపథ్యంలో ఉప్పాడవద్ద కూడా ప్రైవేటు భాగస్వామ్యంతో అన్ని వసతులూ గల బీచ్ రిజార్ట న్ను డెవలప్ చెయొచ్చు.

## హోప్ ఐలాండ్:

కాకినాడకు 5 కి. మీ.ల దూరంలో సుమారు 1000 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న హోప్ ఐలాండ్ ఉప్పాడ బీచ్ సందర్శకులకు మరో ఆకర్షణ. 17 కి.మీ.ల పొడవు, 5 నుంచి 2 కి.మీ.ల వెడల్పు గల హోప్ ఐలాండ్కు ఒక పక్క సముద్రజలాలు, మిగతా మూడు పక్కలా జలాశయంతో, కాకినాడ పోర్టుకు పడవలు, ఓడలు రావటానికి వీలుగా ఉంది. కాకినాడ నుంచి వెళ్ళిన వారికి విచిత్రమైన అనుభూతి కలగటం మాత్రం నిజం. మీకు తెలుసో లేదో గాని ఈ ఐలాండ్ మీద రెండు చిన్న గ్రామాలున్నాయి కూడా.

(మరికొన్ని బీచుల వివరాలు రేపటి సంచికలో)



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు



# డ్రగ్స్ కేసు నుంచి ఈ హీరోయిన్లకు విముక్తి

బాలీవుడ్ ను షేక్ చేసిన డ్రగ్స్ కేసు నుంచి హీరోయిన్లు శ్రద్ధా కపూర్, నోరా ఫతేహికి ఊరట లభించినట్టు తెలుస్తోంది. ఈ కేసులో వీరిపై తగిన ఆధారాలు లేకపోవడంతో, చార్జిషీట్ నుంచి పోలీసులు వీరిద్దరి పేర్లను తొలగించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. 2022 నాటి ఈ కేసులో సుదీర్ఘ విచారణ తర్వాత, ఈ ముద్దుగుమ్మలకు ఇలా ఊరట దక్కింది.
గతంలో ఈ ఇద్దరి పేర్లు డ్రగ్స్ కేసుకు సంబంధించి వినిపించడంతో ముంబై పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. పలు సందర్భాల్లో వీరిని విచారించి, వారి ఫోన్ డేటాతో పాటు ఆర్థిక లావాదేవీలను కూడా నిశితంగా పరిశీలించారు. అయితే, డ్రగ్స్ వాడకానికి లేదా విక్రయాలకు సంబంధించి ఎటువంటి ప్రత్యక్ష ఆధారాలు దొరకలేదని తెలుస్తోంది.
శ్రద్ధా కపూర్, నోరా ఫతేహిలను గతంలోనే పోలీసులు విచారించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో వారు తమకు ఎటువంటి డ్రగ్స్ నెట్వర్క్తో సంబంధం లేదని స్పష్టం చేశారు. కేవలం పరిచయాల రీత్యా కొందరితో మాట్లాడాల్సి వచ్చిందని, అది నేరపూరితమైన చర్య కాదని వారు వివరణ ఇచ్చారు. తాజా ఛార్జ్ షీట్ లో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించినట్టు తెలుస్తోంది. మొత్తానికి, బాలీవుడ్ను కుదిపేసిన ఈ డ్రగ్స్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది.
ఆధారాలు లేని కారణంగా ఇద్దరు హీరోయిన్ల పేర్లను పక్కన పెట్టడం వల్ల, ఈ కేసు దర్యాప్తు ఇప్పుడు మిగతా నిందితుల చుట్టూ మరింత బలంగా చుట్టుకున్నట్టయింది. మరోవైపు సోషల్ మీడియా సెలబ్రిటీ ఓరీ పేరును సైతం ఎఫ్ఐఆర్ నుంచి తొలగించినట్టు తెలుస్తోంది. త్వరలోనే వీళ్లందరికీ చట్టపరంగా క్లీన్ చిట్ లభించే అవకాశాలున్నాయి.

# హీరోల రాజ్యంలో నిర్మాత పరిస్థితి ఇది

"సినిమా ఫ్లాప్ అయితే గాయపడతాం. పైసలు పెడతాం కాబట్టి సినిమా హిట్టయితే హ్యాపీ. చాలాసార్లు గాయపడుతుంటాం. ఏ సినిమాకు ఎక్కువ గాయపడ్డానో చెప్పను. మా మిత్రులు (జర్నలిస్టులు) రెడీగా ఉన్నారు. పొరపాటున ఓ హీరో గురించి చెబుతే, ఏసుకుంటారు. నేను ఆ అవకాశం ఇవ్వను."
దిల్ రాజు లాంటి నిర్మాత నుంచి వచ్చిన స్టేట్ మెంట్ ఇది. డబ్బులు పెట్టి సినిమా తీసిన నిర్మాత, తన డబ్బులు పోయాయని బహిరంగంగా చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నాడు. పరిశ్రమలో హీరోల డామినేషన్ నడుస్తోందని చెప్పడానికి బహుశా ఇంతకంటే మరో పెద్ద ఎగ్జాంపుల్ ఉండదేమో.
టాలీవుడ్ లో తిరుగులేని నిర్మాత దిల్ రాజు. ఆయన నిర్మాత మాత్రమే కాదు, టాలీవుడ్ తరఫున తెలంగాణ ప్రభుత్వంలో ఓ భాగం, సినీ పెద్దల్లో ఒకరిగా తిరుగులేని స్థానం. ఇలాంటి వ్యక్తి కూడా తన కెరీర్ లో ఫ్లాప్ సినిమా పేరు బయటకు చెప్పడానికి భయపడుతున్నాడంటే, పరిశ్రమలో హీరోస్వామ్యం ఏ స్థాయిలో పాతుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు.
నిజానికి దిల్ రాజు స్టేట్ మెంట్ వెనక భయంతో పాటు ఓ స్వీయానుభవం కూడా ఉంది. గతంలో చరణ్ తో గేమ్ ఛేంజర్ అనే సినిమా తీశాడు ఈ నిర్మాత. అది డిజాస్టర్ అయింది. ఆ విషయాన్ని బయటకు చెప్పినందుకు మెగా ఫ్యాన్స్ నుంచి అతడిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.
"గేమ్ ఛేంజర్ విషయంలో మీడియా, జర్నలిస్టులు మమ్మల్ని చంపుకు తింటున్నారు. సినిమా రిలీజై 6 నెలలు అయిపోయింది. సినిమా ఫ్లాప్ అయింది, మళ్లీ ఎందుకు గేమ్ ఛేంజర్ టాపిక్ తెస్తున్నారు. ఇండస్ట్రీలో ఫ్లాప్ అయిన భారీ బడ్జెట్ సినిమాలు చాలా ఉన్నాయి. ఏ సినిమానూ ఇంత పట్టుకోలేదు. గేమ్ ఛేంజర్, దిల్ రాజు అనే రెండు టాపిక్స్ మాత్రమే పట్టుకున్నారు. ఇంత నెగెటివిటీ ఎందుకు." అంటూ గతంలో ఆయన తన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పెద్ద చేదు అనుభవం ఉంది కాబట్టే, నిర్మాతగా తనను బాగా గాయపరిచిన సినిమా పేరు చెప్పడానికి ఆయన తెగ ఇబ్బంది పడ్డాడు. కావాలంటే ఆయన గేమ్ ఛేంజర్ పేరును మరోసారి ప్రస్తావించొచ్చు. కానీ ఆ పని చేయలేదు. దిల్ రాజు లాంటి బడా నిర్మాత, పెద్ద మనిషి పరిస్థితే ఇలా ఉందంటే.. ఇక మిడ్-రేంజ్ నిర్మాతలు, చిన్న నిర్మాతల పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే ఊహించుకోవచ్చు. అసలే ఇది మనోభావాలు దెబ్బతినే సీజన్. సినిమా ఫ్లాప్ అనే టాక్ వస్తే చాలు, చిన్న హీరో సైతం హర్ట్ అయిపోతున్నాడు. వాస్తవాన్ని అంగీకరించడానికి అస్సలు ఇష్టపడడం లేదు.



ప్రస్తుతం పరిశ్రమలో చిన్న-పెద్ద అనే తేడా లేకుండా హీరోలదే రాజ్యం. వాళ్లు చెప్పిందే కథ, తీసిందే సినిమా, వాళ్లు చెబితేనే సినిమా రిలీజ్ అవుతుంది. ఈ విషయంలో బేసిగ్గా తప్పు చేసింది నిర్మాతలే. దశాబ్దాలుగా హీరోల్ని 'బాబూ..బాబూ' అంటూ గారాబం చేశారు. దీంతో సినిమా ఫ్లాప్ అంటే తట్టుకోలేని స్థితికి చేరిపోయాడు టాలీవుడ్ సగటు హీరో.

# బీసీ సంఘంలో క్రమశిక్షణ చర్యలు



- జిల్లా అధ్యక్షుడి సస్పెన్షన్
- కొత్త అధ్యక్షుడిగా పిట్ట పోలయ్య
- సోంపేటలో స్టాండింగ్ కమిటీ సమావేశం

**నవతరం-సోంపేట**

జాతీయ బీసీ సంక్షేమ సంఘం శ్రీకాకుళం జిల్లా క్రమశిక్షణ స్టాండింగ్ కమిటీ సమావేశం సోమవారం సోంపేటలో కమిటీ అధ్యక్షుడు లోకినీది గోవిందరాజులు ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో సోంపేట, ఇచ్ఛాపురం, కంచిలి మండలాల కన్వీనర్లు కడియం ప్రసాద్, సాలిన ఢిల్లీ రావు, ధనంజయతో పాటు జిల్లా కార్యదర్శి విశ్వ ప్రభాకర్ రావు, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

సభ్యుల పనితీరుపై చర్చించిన అనంతరం, జిల్లా అధ్యక్షుడు సాలిన నరసింహులు సంఘ కార్యకలాపాలకు దూరంగా ఉండటం, స్పందించకపోవడం, అనధికారికంగా పత్రిక ప్రకటనలు జారీ చేసి ప్రభుత్వాన్ని విమర్శించడం వంటి అంశాలను కమిటీ సీరియస్‌గా పరిగణించింది. దీంతో సంఘ రాజ్యాంగంలోని క్రమశిక్షణ నిబంధనల ప్రకారం సాలిన నరసింహులను సంఘం నుంచి సస్పెండ్ చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇకపై ఆయన వ్యక్తిగతంగా చేసే చర్యలకు సంఘానికి సంబంధం లేదని స్పష్టం చేసింది.

అదేవిధంగా, శ్రీకాకుళం జిల్లా బీసీ సంక్షేమ సంఘం కొత్త అధ్యక్షుడిగా మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన పిట్ట పోలయ్యను నియమించింది. సోంపేట మండల పోస్టల్ సహాయ కార్యదర్శిగా పిట్టా హరికృష్ణను నియమిస్తూ డాక్టర్ సిపాన గుణవతి నియామక పత్రాలు అందజేశారు.

# పలాస జిల్లా ఉద్దానం ప్రజల చిరకాల వాంఛ

- రాజకీయాలకు అతీతంగా జిల్లా సాధన కోసం అందరూ భాగస్వామ్యం కావాలి
- పలాస జిల్లా సాధన కమిటీ సభ్యులు దుమ్ము దీనబంధు

**నవతరం-సోంపేట**



అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలంటే, అధికార వికేంద్రీకరణ అనివార్యం అవుతున్నప్పుడు, ఎన్నో దశాబ్దాలుగా అనేక రంగాలలో వెనుకబాటు తనానికి గురైన ఉద్దానం ప్రాంతం అభివృద్ధి చెందాలంటే, పలాస జిల్లా ఏర్పాటు ఉద్దానం ప్రజల చిరకాల వాంఛ అని పలాస జిల్లా సాధన కమిటీ సభ్యులు దుమ్ము దీనబంధు అన్నారు. సోమవారం ఆయన సోంపేట మండలం బారువాలో మాట్లాడుతూ, పాలకులు పరిపాలన సౌలభ్యం కోసం 12 జిల్లా లను 28 జిల్లాలుగా పునర్విభజన చేసినప్పటికీ, పలాస జిల్లా ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రతిపాదించి, తర్వాత ఈ ప్రక్రియ ఆపివేయడం ఎంతవరకు సమంజసమని దీనబంధు ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి వెళ్లాలంటే దాదాపు 130 కిలోమీటర్లు అనేక ప్రయాసలు పడవలసి వస్తుందని, ముఖ్యంగా వైద్యం కోసం అంత దూరం ప్రయాణం చేసి రావడం చాలా ఇబ్బందికరంగా ఉంటుందని, జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లడానికి కూడా సుదూర ప్రయాణం అనివార్యం అవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పలాస కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తే ఇచ్ఛాపురం నియోజకవర్గం తో పాటు టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. టెక్కలి నియోజకవర్గం తో పాటు పలాస, ఇచ్ఛాపురం నియోజక వర్గాలల్లో ఆనుకొని సుదూర సాగర తీరం ఉందని, ఒకపక్క మూలపేట పోర్టు ఈ ప్రాంతానికి అందుబాటులోకి రానున్నదని, బారువ సాగర తీరం మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉందన్నారు. అలాగే పర్యావరణానికి హానిలేని పారిశ్రామిక అభివృద్ధి చేసేందుకు వేలాది ఎకరాలు ప్రభుత్వ బంజరు భూములు కూడా ఉన్నాయని, అక్కడ పరిశ్రమలు నెలకొల్పితే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చునని, అందుకు పలాస జిల్లా సాధన తోనే ఉద్దానం ప్రాంతం అభివృద్ధి చెందుతుందని దీనబంధు స్పష్టం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి అనేక దశాబ్దాలు గడిచినప్పటికీ, ఉద్దానం ప్రాంతం మాత్రం వలసలు అడ్డా గా మారిపోయిందని, రాష్ట్రంలో మిగతా జిల్లాల ప్రజల జీవన ప్రమాణాలు, తలసరి ఆదాయం ఈ ప్రాంతంతో పోల్చితే, ఇచ్ఛాపురం నియోజకవర్గం అట్టడుగు స్థానంలో ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సాగు, తాగునీటి అవసరాలతో పాటు విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయ, ఆర్థిక, సామాజిక రంగాలలో ఉద్దానం ప్రాంతం అభివృద్ధి చెందాలంటే, పలాస జిల్లాసాధనే శరణ్యమని, అందుకు ఈ పోరాట ఉద్యమానికి శ్రీకారం చుట్టిన ప్రముఖ సామాజిక వేత్త, న్యాయవాది దువ్వాడ శ్రీధర్ ( బాబా) నాయకత్వానికి తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, రాజకీయాలకు అతీతంగా తమతో కలిసి వచ్చే అన్ని వర్గాల వారి భాగస్వామ్యంతో, ఈ పోరాట ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్ళవలసిన బాధ్యత మన అందరిపై ఉందని ఆయన కోరారు.

# పచ్చని భవిష్యత్తును నిర్మిద్దాం

**లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ బృందం**

**నవతరం-శ్రీకాకుళం**



లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో, శ్రీకాకుళం జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులుతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుడ్డ సంచుల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ బృందం తెలిపింది. క్లబ్ జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ పొన్నాడ.రవి కుమార్ సోమవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులందరికీ గుడ్డ సంచులు అందజేయడం ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే సందేశాన్ని అందించగలిగామని, మన పరిసరాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఈ చిన్న ప్రయత్నం పెద్ద మార్పుకు నాంది కావాలన్నారు. అనంతరం ఉత్సాహంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలని, కలిసి ముందుకు సాగుతూ, పచ్చని భవిష్యత్తును నిర్మిద్దామని క్లబ్ మెంటార్ నటుకుల.మోహన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు బృందంతో పాటుగా, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# "99% మందికి తెలియని రామాయణ రహస్యం!"




ఈ కథ ప్రధానంగా ఆధ్యాత్మ రామాయణం మరియు ఆనంద రామాయణం వంటి ఆధ్యాత్మిక గ్రంథాలలో కనిపించే ఒక గంభీరమైన భావన. వాల్మీకి మహర్షి రచించిన వాల్మీకి రామాయణంలో మాత్రం ఈ కథ లేదు. అందుకే దీన్ని అర్థం చేసుకోవాలంటే దాని వెనుక ఉన్న ఆధ్యాత్మిక ఉద్దేశ్యాన్ని కూడా గ్రహించాలి. పంచవటి అడవిలో శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు నివసిస్తున్న సమయంలో రావణుడు సీతను అపహరించాలనే కుట్రను పన్నుతాడు. ఈ ప్రమాదాన్ని ముందుగానే గ్రహించిన దేవతలు, ముఖ్యంగా అగ్నిదేవుడు, ఒక దివ్య యోచనను రూపొందిస్తారు. అగ్నిదేవుడు రాముడి ముందు ప్రత్యక్షమై, సీత పవిత్రతను కాపాడటానికి ఒక మార్గాన్ని సూచిస్తాడు---రావణుడు అసలు సీతను తాకకుండా ఉండేందుకు ఆమెను తన సంరక్షణలోకి తీసుకుని, ఆమె స్థానంలో అదే రూపం, అదే స్వభావం కలిగిన "మాయా సీత"ను ఉంచుతాడు. ఈ మాయా సీత దివ్య మాయతో సృష్టించబడిన ప్రతిరూపం కావడంతో, బయటికి చూస్తే ఎవరూ తేడా గుర్తించలేరు. తరువాత రావణుడు పంచవటికి వచ్చి అపహరించినది నిజమైన సీత కాదు, ఆ మాయా సీత మాత్రమే. అందువల్ల లంకలో అశోకవాటికలో బాధపడుతున్నది, నిరీక్షిస్తున్నది కూడా మాయా సీతే అని ఈ కథనం చెబుతుంది; అసలు సీత మాత్రం అగ్నిదేవుని సంరక్షణలో దివ్య స్థితిలో ఉంటుంది. లంక యుద్ధం ముగిసిన తర్వాత అగ్ని పరీక్ష సమయంలో మాయా సీత అగ్నిలో లీనమై, ఆ అగ్నిలోనుంచి అసలు సీత బయటకు వచ్చి రాముడితో కలుస్తుంది. ఈ విధంగా సీతాదేవి పరమ పవిత్రతను ఎవరూ సందేహించలేని విధంగా ఈ భావన వివరిస్తుంది. రావణుడు ఎంత శక్తివంతుడైనా అసలు సీతను తాకలేకపోయాడని, ఆమె దైవ స్వరూపం ఎప్పటికీ అపవిత్రం కాలేదని ఇది బలంగా చెబుతుంది. అలాగే రాముడు కూడా ఈ సమస్తాన్ని ముందుగానే తెలిసిన దైవ స్వరూపంగా ప్రతిబింబిస్తాడు. అయితే మళ్లీ గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే, వాల్మీకి రామాయణంలో ఈ కథ లేదు; అక్కడ రావణుడు అపహరించింది నిజమైన సీతనే, అగ్ని పరీక్ష ఆమె పవిత్రతను నిరూపించడానికి మాత్రమే ఉంటుంది. మొత్తంగా చూస్తే, "మాయా సీత" కథ ఒక ఆధ్యాత్మిక, భక్తి ప్రధాన వివరణగా, సీతాదేవి మహిమను మరింత ఉన్నతంగా చూపించడానికి రూపొందించబడిన భావనగా అర్థం చేసుకోవచ్చు. ముగింపుగా, సీతాదేవి ఒక పాత్ర మాత్రమే కాదు; ఆమె పవిత్రతకు, శక్తికి, దైవత్వానికి ప్రతిరూపం. అగ్ని పరీక్ష కూడా కేవలం పరీక్ష కాదు, నిజం తిరిగి వెలుగులోకి వచ్చే క్షణం. అయినప్పటికీ ఇది ఒక భక్తి పరమైన ఆధ్యాత్మిక భావన మాత్రమే అని గుర్తుంచుకోవాలి, ఎందుకంటే వాల్మీకి రామాయణంలో ఇది కనిపించదు. అయినా ఈ కథ మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది---ధర్మం ఎప్పటికీ గెలుస్తుంది, సత్యం ఎప్పటికైనా వెలుగులోకి వస్తుంది. మళ్ళీ కలుద్దాం మరో ఆసక్తికరమైన కథతో. ధన్యవాదాలు ??

**భక్తి కలం: తేరాల రాజేంద్రప్రసాద్ గుప్తా - బాబు జగ్జీవన్ రామ్ నగర్, హైదరాబాద్ 500037**

# కూటమి ప్రభుత్వ వైఫల్యంతోనే ఇంధన వనరులు కొరత

- నాడు వంట గ్యాస్.. నేడు పెట్రోల్, డీజల్ కొరత వల్ల ప్రజలకు ఇబ్బందులు
- వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు

**నవతరం-పలాస**

రాష్ట్రంలో గత నాలుగు రోజులుగా పెట్రోల్, డీజిల్ వంటి ఇంధన ఓనర్లు దొరక్క బంకులు వద్ద ప్రజలు క్యూ కొడుతున్నారని, సరుకుల రవాణా నిలిచిపోయిందని, 45 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే సీఎం చంద్రబాబు మాత్రం ఈ సంక్షోభం వచ్చినప్పుడు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన పలాసలో మాట్లాడుతూ, మన రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఈ పరిస్థితికి పూర్తిగా చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం, వైఫల్యం, అనాలోచిత విధానాలే కారణమన్నారు. ఇంధన సరఫరా వ్యవస్థను సక్రమంగా నిర్వహించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ అసమర్థత కారణంగా సాధారణ ప్రజలు, ఉద్యోగులు, రైతులు, రవాణా రంగానికి చెందినవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, నారా లోకేష్ కనిపించడం లేదన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఆరోగ్యం బాగో లేకపోవడంతో, ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారని, చంద్రబాబు చేతులు ఎత్తేసారని ఆయన ఎద్దేవా చేశారు. చంద్రబాబు తక్షణం మేల్కొని సొరకాయ కోతలు మాటలు ఆపి నరేంద్ర మోడీతో మాట్లాడి రాష్ట్రంలో ఉన్న పెట్రోల్, డీజిల్ ఇబ్బందుల నుంచి ప్రజలను గట్టెక్కించాలని ఆయన డిమాండ్ చేశారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం లో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ రాలేదని, అప్పట్లో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వ్యవస్థలను సమర్థవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ప్రపంచాన్ని గడగడ లాడించిన కరోనా మహమ్మారి సమయంలో కూడా వైయస్ జగన్ ధైర్యంగా, సమర్థవంతంగా పరిస్థితిని ఎదుర్కొన్నారని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని పెట్రోల్, డీజిల్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని బమ్మిడి దుర్యోధనరావు డిమాండ్ చేశారు.



Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**